ప్రజాశక్తి

శుక్రవారం 21 నవంబర్ 2025



22న గ్రామసభలు

డ్వామా పీడీ శారదాదేవి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఈ నెల 22న జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నట్లు డ్వామా పీడీ ఎస్.శారదాదేవి తెలిపారు. ఉపాధి హామీ అమలు మరింత పారదర్శకంగా, ప్రజలకు చేరువగా ఉండేలా ఈ గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు గ్రామాల్లో సభా ఏర్పాట్లను పూర్తిచేసి, ప్రజలకు అందించే సేవలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి శ్రామికులు, గ్రామస్తులు, గ్రామ ప్రజాప్రతినిధులు ఈ సభలకు హాజరై తమ సమస్యలను నేరుగా అధికారులకు తెలియజేసి పరిష్కారం పొందాలని కోరారు. ఉపాధి శ్రామికులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.



తాటిపూడి రిజర్వాయరు

జిల్లాలోని పర్యాటకాభివృద్ధి ఊహలకు, ప్రతిపాదనలకు మాత్రమే పరిమితమైంది. హామీలు, మాటల గారడీకీ.. ఆచరణకు అంతులేని అంతరాలు కనిపిస్తున్నాయి. వాస్తవానికి జిల్లాలో ఎన్నో పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. వీటిని కాస్తంత డబ్బుతో అభివృద్ధి చేస్తే పర్యాటకులను రా... రమ్మంటున్నట్టు ఆకర్షిస్తాయి. ఇదే విషయం జిల్లాలోని ప్రజాప్రతినిధులు, మారిన కలెక్టర్లు ఎన్నో ఏళ్లుగా చెబుతున్నారు. కానీ, నిధులు మంజూరు చేసేందుకు ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ముందుకు రావడం లేదు. ప్రజాప్రతినిధులు కూడా ఇందుకు అనుగుణంగా కృషి చేయడం లేదు. అంతకు మించి నోరు మెదిపితే 'ఏ ఇజమూ లేదు.. అంతా టూరిజమే' అన్న చంద్రబాబు ప్రభుత్వం సైతం అందుకు భిన్నంగా వ్యవహరించడం గమనార్హం. దీంతో, కార్తీకమాస సమయాల్లో కూడా కాసింత ఆహ్లాదంగా గడిపేందుకు ఇరుగుపొరుగు జిల్లాలకు లేదా సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది.

ఊహాల పల్లకిలో పర్యాటకాభివృద్ధి

- నిధుల మంజూరుకు మీనమేషాలు
- టూరిజం అభివృద్ధికి అపార అవకాశాలంటూ ఉత్తుత్తి మాటలు
- కార్తీకం వేళ సేదదీరేందుకూ ఇతర జిల్లాలకు పోవాల్సిందే!

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

తాటిపూడి జలాశయం.. ఇప్పటికే జిల్లాలోని ఓ ముఖ్యమైన పర్యాటక కేంద్రంగా ప్రాచుర్యం పొందింది. పర్యాటకులను మరింతగా ఆకర్షించాలనే లక్ష్యంతో రూ.23 కోట్లతో ఎకో టూరిజం తలపెట్టారు. ఇప్పటికే జలాశయంలో బోటింగ్ ఉంది. దీన్ని మరింతగా అభివృద్ధి చేస్తామంటూ టిడిపి అధికారంలోకి వచ్చాక ప్రతిపాదనలు తయారు చేశారు. ఇందులో భాగంగా అదనంగా జలాశయం దిగువభాగంలో 10.63 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. ఇందులో 12 కాటేజీలు, రెండు కొండల నడుమ రోప్ వే, కేబుల్ అండ్ సస్పెన్ బ్రిడ్జి, చిల్డ్రన్ పార్కు, బర్డ్‌పార్కు, రెస్టారెంట్, కన్వెన్షన్ హాల్, ఓపెన్ ఎయిర్ థియేటర్, తదితర వాటిని నిర్మించేందుకు అనుగుణంగా ఏడాది క్రితం ప్రతిపాదన తయారు చేశారు. వీటిన్నింటికీ రూ.23 కోట్ల మేర అవసరమౌతుందని అధికారులు అంచనాలు రూపొందించారు. ఆచరణలో నిధులు కేటాయించకపోవడంతో ఆలోచనలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి.

రామతీర్థం.. చారిత్రక ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు పొందింది. ఇక్కడ బౌద్ధ, జైన మతాల అవశేషాలు ఉన్నాయి. టెంపుల్ టూరిజంలో భాగంగా వీటిని పరిరక్షించేందుకు అవకాశం ఉంది. దీన్ని టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేస్తామంటూ స్థానిక ఎమ్మెల్యే సహ ప్రభుత్వం ప్రగల్బాలు పలికింది. ఇందులో భాగంగా మ్యూజియం ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉంది. కోనేరు గట్టు సుందరీకరణ, కొండపైన వ్యూపాయింట్ ఏర్పాటు, అక్కడే టీ, స్నాక్స్ అందుబాటులో ఉండేవిధంగా చేయాలనే ప్రణాళిక అధికారులు రూపొందించారు. ఇందుకోసం రూ.10 కోట్లు అవసరం కానున్నట్టు కూడా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించింది. అయినా ప్రభుత్వం నుంచి ఉలుకూ పలుకూ లేకుండా పోయింది.

గోపాలరాజు కోనేరు.. రామనారాయణం ఎదురుగా ఉన్న ఈ కోనేరు సారిక రెవెన్యూ పరిధిలో ఉంది. 8.5 ఎకరాల్లో ఉన్న విస్తరించి ఉన్న ఈ కోనేరు నిత్యం తొణికిసలాడుతూ ఎంతో ఆహ్లాదాన్నిస్తోంది. దీన్ని టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేస్తే రామనారాయణం వచ్చే పర్యాటకులంతా ఇక్కడ పిల్లలతో కలిసి సేద తీరడానికి, విహరించడానికి ఎంతో అనువుగా ఉంటుంది. అందుకే ఇక్కడ రూ.6 కోట్లతో బోటింగ్, చిల్డ్రన్ పార్కు, కోనేరు సుందరీకరణ, అక్కడే ఫుడ్ కోర్టు, రెస్టారెంట్, హాట్ ఎయిర్ బెలూన్ వంటివి ఏర్పాటు చేయాలనే ఆలోచన చేశారు. ఇది కూడా ఆచరణకు నోచుకోలేదు.

చింతపల్లి బీచ్.. బీచ్ టూరిజంలో భాగంగా చింతపల్లి తీరంలో రూ.6 కోట్లతో టూరిజం అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వానికి అధికార యంత్రాంగం ప్రతిపాదన పంపింది. వాస్తవానికి ఇక్కడ మూడు కాటేజీలు ఉండేవి. ప్రస్తుతం అవి మరమ్మతులకు చేరుకోవడంతో పర్యాటకులు సేద తీరేందుకు అవకాశం లేదు. ఈ నేపథ్యంలో మొత్తం 20 గదులు గలిగిన 10 హరిత రిసార్ట్స్‌ను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన తయారు చేశారు. పర్యాటకులు బీచ్‌ను ఆస్వాదించేందుకు వసతి, తీర ప్రాంతానికి వచ్చేపోయేందుకు ప్రత్యేకమైన రహదారులు, రెస్టారెంట్, కాంపౌండ్‌వాల్ వంటి సదుపాయాలు అవసరం కానున్నాయి. కానీ, కేవలం రూ.కోటితో సరిపెట్టారు. ఇది కూడా ప్రభుత్వం రంగంలో కాదు సుమా..! ఒక ప్రైవేటు సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇంకా ఆ పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. అందుబాటులోకి వచ్చాక పర్యాటకులపై ఆ ప్రయివేటు సంస్థ ప్రవేశ రుసుం వసూలు చేసే అవకాశాలు ఉన్నాయి. ఇవి కేవలం మచ్చుకు మాత్రమే ఇంతకు మించి పర్యాటకంగా అభివృద్ధి చేసి, తద్వారా జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం మాటలతోనే కాలక్షేపం చేస్తోంది.

ఔను...! 4 ప్రాజెక్టులు ప్రతిపాదించాం



జిల్లాలో రూ.47.5 కోట్ల అంచనాతో నాలుగు చోట్ల పర్యాటకాభివృద్ధి చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదించాం. చింతపల్లి బీచ్‌లో టూరిజం అభివృద్ధికి ఒక సంస్థ ముందుకు వచ్చింది. మిగిలిన చోట్ల ఇంకా నిధులు మంజూరు కావాల్సి ఉంది. ముఖ్యంగా తాటిపూడిలో ఎకో టూరిజం, చింతపల్లిలో హరిత రిసార్ట్స్ నిర్మాణం, రామతీర్థం ఆలయ పరిసరాలను చారిత్రక ఆధ్యాత్మిక కేంద్రంగాను, రామనారాయణం క్షేత్రానికి సమీపంలోని గోపాలరాజు కోనేరును చిల్డ్రన్ పార్కుకుగాను అభివృద్ధికి అనుగుణంగా గత ఏడాదే ప్రభుత్వానికి నివేదిక పంపాం.

– కె.కుమారస్వామి,
పర్యాటక శాఖ జిల్లా అధికారి

సానుభూతి కాదు... సహానుభూతి చూపండి

- ఇతరులతో సమానంగా ఎస్‌సిలు ఎదగాలి
- వారికి సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలి
- రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ కెఎస్ జవహర్
- జిల్లాలో విస్తృత పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ జవహర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఎస్‌సిల పట్ల సానుభూతి కాకుండా, వారి బాధలను మనస్ఫూర్తిగా అర్థం చేసుకొని సహానుభూతి చూపించాలని రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ కెఎస్ జవహర్ కోరారు. ఇతరులతో సమానంగా ఈ 15 శాతం జనాభా కూడా అభివృద్ధి చెందేందుకు ప్రతిఒక్కరూ సహకారం అందించాలని సూచించారు. కమిషన్ సెక్రటరీ ఎస్.చినరాముడుతో కలిసి చైర్మన్ జవహర్ గురువారం జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. చైర్మన్‌కు కలెక్టరేట్ వద్ద అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి, ఎస్‌పి ఎఆర్ దామోదర్‌తో కలెక్టర్ ఛాంబర్లో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. ముందుగా జెడ్‌పి అతిథి గృహంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 45 వినతులు అందాయి. మధ్యాహ్నం వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్లో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి, ఎస్‌సిల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాల అమలుతీరును తెలుకున్నారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో పర్యటించి, క్షేత్రస్థాయి పరిస్థితులను చైర్మన్ పరిశీలించారు.

సమీక్షా సమావేశంలో చైర్మన్ జవహర్ మాట్లాడుతూ ఎన్నో సామాజిక ఉద్యమాలు జరిగిన ఈ ప్రాంతంలో కూడా ఎస్‌సిల పట్ల వివక్షత కొనసాగుతుండటం బాధాకరమని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితి మారేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలనూ తీసుకోవాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. వారికి విద్య, వైద్యం, చక్కని ఆహారం అందేలా చూడాలన్నారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం పొందుతున్న ప్రయివేటు విద్యాసంస్థల్లో కూడా ఎస్‌సిలకు రిజర్వేషన్ అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఎక్కువగా పర్యటిస్తూ, పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. ఆర్‌డిఒ, డిఎస్‌పి స్థాయి అధికారులు ఎస్‌సి బాలుర హాస్టళ్లను తరచూ తనిఖీ చేయాలని ఆదేశించారు.

కమిషన్ కార్యదర్శి చినరాముడు మాట్లాడుతూ దళితుల నుంచి వచ్చే ఫిర్యాదుల్లో ఎక్కువ శాతం భూములకు సంబంధించినవే వస్తున్నాయని చెప్పారు. వారి సమస్యలకు వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలన్నారు. చూపలేని పక్షంలో కారణాలను సవివరంగా తెలియజేసి, పరిష్కార మార్గం చూపించాలని సూచించారు. కులం పేరుతో దూషిస్తున్నారన్న కేసులు ఈ ప్రాంతంలో ఎక్కువగా వస్తున్నాయని, వీటిని అరికట్టాలని కోరారు.

కమిషన్ ఆదేశాలపై కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి స్పందిస్తూ 15 రోజుల్లో తగిన చర్యలను తీసుకుంటామని తెలిపారు. పిజిఆర్ఎస్‌లో పించనుదారుల సంతృప్తే ముఖ్యంగా వివిధ చర్యలను తీసుకుంటున్నామని చెప్పారు. దీనిలో భాగంగా అసంతృప్తి వ్యక్తం చేసిన ఫిర్యాదుదారులను మండల ప్రత్యేకాధికారులు నేరుగా సంప్రదించి, వారి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారని వివరించారు. ప్రతి నెలా హాస్టళ్లు, పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేస్తున్నామని తెలిపారు. ఎస్‌పి ఎఆర్ దామోదర్ మాట్లాడుతూ జిల్లాలో అట్రాసిటీ కేసుల విషయంలో ప్రత్యేక దృష్టి పెడుతూ బాధితులకు న్యాయం అందేవిధంగా కృషి చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేథు మాధవన్, ఎఎస్‌పి సౌమ్యలత, డిఆర్ఒ ఎస్.శ్రీనివాస మూర్తి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి అన్నపూర్ణ, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి వెంకటేశ్వర రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలి

విజయనగరంటౌన్ : అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ జెఎసి జిల్లా అధ్యక్షులు గండిపిల్లి మహేంద్ర బాబు, ప్రధాన కార్యదర్శి పల్లికల శ్రీను, నాయకులు.. ఎస్‌సి కమిషన్ చైర్మన్ కెఎస్ జవహర్‌కు వినతి అందించారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ బి.కిశోర్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.రమణ పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఎస్‌సి కమిషన్ చైర్మన్ జవహర్‌కు దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు, అంబేద్కర్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు భానుమూర్తి వేర్వేరుగా వినతులు అందించారు. ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టం అమలు తీరుపై సిటిజన్స్ ఆడిట్ నివేదికను చైర్మన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. జిల్లాలో కొనసాగుతున్న అంటరానితనం, వివక్షత వంటి రూపాలపై నిర్దిష్టమైన చర్యలు చేపట్టి దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని చిట్టిబాబు కోరారు.



విద్యార్థినితో మాట్లాడుతున్న చైర్మన్

హాస్టల్లో తనిఖీలు

గజపతినగరం, రామభద్రపురం : గజపతి నగరం సాంఘిక సంక్షేమ ప్రీ మెట్రిక్ బాలికల వసతిగృహాన్ని, రామభద్రపురంలోని ఎస్‌సి హాస్టల్‌ను ఎస్‌సి కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సమావేశమై, వారి సమస్యలు తెలుసుకున్నారు.

ముంజేరులో ఉద్రిక్తత



ఘర్షణకు దిగిన గ్రామస్తులు

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలోని ముంజేరు గ్రామంలో కాలువల నిర్మాణం మరోసారి ఉద్రిక్తతలకు దారితీసింది. గత మంగళవారం అధికారుల సమక్షంలో కాలువ తవ్వకాలు చేపట్టేందుకు జెసిబితో ప్రయత్నించగా, సిద్ధార్థ కాలనీ వాసులు అడ్డుకున్నారు. గురువారం అధికారులు, పోలీసులు తిరిగి వచ్చి కాలువ పనులు ప్రారంభించేందుకు ప్రయత్నించారు. సిద్ధార్థ కాలనీ మహిళలు అడ్డుకోవడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఇరుగ్రూపుల మధ్య తీవ్ర వాగ్వాదాలు జరిగి, ఒకరిపై ఒకరు ఇసుక, కారం విసురుకునే స్థితికి చేరుకుంది. ఎస్ఐ సూర్యకుమారి, ఎఎస్ఐ తవుడు, పోలీసులు వారిని చెదరగొట్టారు. సిద్ధార్థ కాలనీ వాసులు అక్కడి నుంచి వెనుదిరగడంతో కాలువను పూర్తిగా తవ్వి కాంక్రీట్ పనులకు అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. ఘటనా స్థలాన్ని డిఎస్‌పి గోవిందరావు, సిఐ దుర్గాప్రసాద్ పరిశీలించారు. ఈ ఘర్షణలో సమీప ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం సిద్ధం చేస్తుండగా, వంటల్లో ఇసుక పడింది. దీంతో పక్కనున్న హైస్కూల్ నుంచి కూర తెచ్చి విద్యార్థులకు భోజనాలు పెట్టాల్సి వచ్చింది.

కొనసాగుతున్న నిరసన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జిందాల్ పరిశ్రమ కోసం భూములు కోల్పోయిన నిర్వాసితుల నిరసన గురువారం నాటికి 158వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా బొడ్డవరలో నిర్వాసితులు మాట్లాడుతూ సుమారు 18 ఏళ్ల పాటు పేద రైతులు నమ్ముకుని సాగు చేసుకున్న పంటలను, నాటిన మొక్కలను అధికార బలంతో క్రూరంగా తొలగించడం చాలా దారుణమన్నారు. ఇది అణచివేతకు పరాకాష్ట అని పేదలను తొక్కేసి, రాజకీయ నేతలకు చెందిన వారి భూములకు రక్షణ కల్పించడం వెనుక ఉన్న రాజకీయ కుట్ర ఏమిటో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. పేదలకు సంకెళ్ళు, పెద్దలకి స్వేచ్ఛ అనే ఈ ద్వంద్వ నీతిని ప్రభుత్వం తక్షణమే మానుకోవాలని అన్నారు. ఈ నిరసనను మరింత ఉధృతం చేస్తామని జిందాల్ నిర్వాసితులు హెచ్చరించారు. తమ భూములు తమకి వచ్చేంత వరకూ పోరాటం కొనసాగిస్తామన్నారు.

గిరిజనుల భూముల రికార్డులు తారుమారు

అధికారులపై సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని ఆగ్రహం



తహశీల్దార్‌తో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

కొండమల్లిపూడి గిరిజనుల సాగు భూములు, ఇళ్ల స్థలాల రికార్డులను గత రెవెన్యూ అధికారులు తారుమారు చేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన గిరిజనులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ 1999లో 11 మంది గిరిజనులకు అప్పటి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తూ పట్టాలు కూడా ఇచ్చిందన్నారు. సర్వే నంబర్ 3లో ఆ ఇళ్ల స్థలాల పట్టాలకు ఎల్‌పిసిలు ఇవ్వాలని పలు ధపాలుగా తహశీల్దార్‌ని కలిస్తే, కాలయాపనే తప్ప ఇంతవరకు ఇచ్చిన దాఖలాలు లేవని మండిపడ్డారు. సర్వే నంబరు 3, 5లోని భూమి జిరాయతీ అని, ఆ భూముల్లో పట్టాలు ఇవ్వలేమని రెవెన్యూ అధికారులు చెబుతున్నారని తెలిపారు. ఈ భూమి '22ఎ'లో ఉన్నందునే 1999లో అప్పటి ప్రభుత్వం 11 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయగా, ఇళ్లు నిర్మించుకొని ఉంటున్నారని గుర్తుచేశారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో కూడా మరికొందరికి సర్వే నంబర్ 3లో ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చారని తెలిపారు. 2007లో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారికి ఈ రెండు సర్వే నంబర్లలోని భూమిని అప్పటి రెవెన్యూ అధికారులు జిరాయతీగా రికార్డులు తారుమారు చేసి, 1966 నుంచి సాగులో ఉన్న ఆదివాసీలకు అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ భూముల్లో గిరిజనులు నీలగిరి, టేకు, జీడిమామిడి తోటలతోపాటు వరి పంటలు పండిస్తూ, జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వీరికి ఎటువంటి సాగు హక్కు కల్పించకుండా, ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల పట్టాలకు ఎల్‌పిసిలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. అనంతరం ధర్నా వద్దకు వచ్చిన తహశీల్దార్ శ్రీనివాసరావుకు తమ్మినేని సమస్యను వివరించారు. స్పందించిన తహశీల్దార్ శ్రీనివాసరావు.. శనివారం భూమి కొన్న వ్యక్తి, సిపిఎం నాయకులు, సాగులో ఉన్న రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తానని హామీఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడు అప్పారావు, నాయకులు మద్దిల రమణ, గిరిజనులు బి.మహేష్, ఆనంద్, స్వర్ణ, దీప్తి, శ్యామ్, నరసింగరావు, రాధ, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని విఆర్‌ఎల నిరసన



నిరసన చేపడుతున్న సిఐటియు, విఆర్‌ఎల సంఘం నాయకులు, విఆర్‌ఎలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గ్రామ రెవెన్యూ సహాయకులకు తెలంగాణ మాదిరిగా జీతాలు పెంచాలని, పే స్కేల్ అమలు చేయాలని గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎల సంఘం ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి అందించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.గురుమూర్తి, సిఐటియు జిల్లా కోశాధికారి ఎ.జగన్మోహనరావు మాట్లాడుతూ విఆర్ఎల సమస్యలపై టిడిపి కూటమి అధికారం చేపట్టి 16 నెలలు కావస్తున్నా ఇప్పటికీ ఎలాంటి స్పందనా లేదన్నారు. పిల్లల చదువులు, వైద్యం, ఇంటి అవసరాలు, రవాణా ఛార్జీలు భారమై ప్రస్తుత జీతంతో జీవనం కష్టంగా మారిందన్నారు. విఆర్ఎలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని, తెలంగాణ మాదిరిగా వేతనాలు పెంచాలని, పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్‌చేశారు. సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే దశలవారీ పోరాటం చేస్తామన్నారు. అందులో భాగంగా ఈ నెల 24న ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో విఆర్ఎల సంఘం నాయకులు కె.ప్రసాద్, పెంటయ్య, అప్పారావు, పైడిరాజు, భవాని, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

తుపాను హెచ్చరికతో రైతుల్లో ఆందోళన



కోసిన వరిచేను కుప్పలు వేస్తున్న రైతులు

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలో చాలా గ్రామాల్లో ఇప్పటికే వరి కోతలు ముమ్మరంగా చేపట్టారు. కోసిన పంట పొలాల్లోనే ఉండగా ఇప్పుడు తుపాను హెచ్చరికలతో రైతుల్లో ఆందోళణ నెలకొంది. దీంతో చాలా మంది రైతులు వరి చేలను పొలాల్లోనే చిన్నచిన్న కుప్పలుగా పెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట చేతికి అందొచ్చే సమయంలో వర్షాలు పడితే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

24 వరకూ డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి- శృంగవరపు కోట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరడానికి ఈనెల 24వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో బీకాం హానర్స్, బిఏ ఎకనామిక్స్, బిఏ పొలిటికల్ సైన్స్, బిఎస్‌సి కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని అర్హులైన విద్యార్థులు ఈనెల 24వ తేదీ లోపల తమ వర్జినల్ సర్టిఫికెట్స్ తీసుకొని కళాశాలకు వస్తే రిజిస్ట్రేషన్ చేసి సీటు కేటాయిస్తామని అన్నారు.



పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో అతిథులు

సెల్‌ఫోన్లు కాదు..

పుస్తకాల వైపు దృష్టి మళ్లించాలి

గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభలో వక్తలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

పిల్లలకు సెల్‌ఫోన్లను అలవాటు చేయడం మానిపించి, పుస్తకాల వైపు దృష్టి మళ్లించేలా చేయాలని వక్తలు.. తల్లిదండ్రులకు సూచించారు. జిల్లాలో నిర్వహించిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి ఆధ్వర్యంలో ముగింపు సభను నిర్వహించారు. వారోత్సవాల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా వయోజన విద్య డిడి ఎస్.సుబ్రహ్మణ్యం వర్మ, గంట్యాడ ఎంఇఒ ఎస్.వెంకటరావు, సాహితీవేత్త ఎ.గోపాలరావు, సముద్రాల గురుప్రసాద్, బుర్ర శ్రీనివాసరావు, బి.రామభద్రరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయ అధికారి ఎస్.జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

గాజులరేగలోని శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎం.లక్ష్మణరావు ఆధ్వర్యాన నిర్వహించిన వారోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. కార్పొరేటర్లు నడిపిల్లి ఆదినారాయణ, రాధామణి, తెలుగు భాష సేవా సంఘం అధ్యక్షులు రామానాయుడు, నారాయణ స్కూల్ ప్రిన్సిపల్ నారాయణరావు, స్వామి గోవిందరావు పాల్గొని విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు.

అక్రమ నిర్మాణాలు తొలగింపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని కెఎల్‌పురం ప్రాంతంలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన లేఅవుట్ హద్దు రాళ్లను గురువారం నగరపాలక సంస్థ సిబ్బంది తొలగించారు. ప్రధాన రహదారి హద్దులను ఆక్రమించి వేసిన సిమెంట్ పోల్స్‌ను, ఫెన్సింగ్ తీగలను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ లేఅవుట్లు వేయాలంటే తప్పనిసరిగా ప్రణాళిక విభాగం నుంచి అనుమతులు తీసుకోవాల్సిందేనని చెప్పారు. కొందరు ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ అనధికారికంగా లే అవుట్లు వేస్తున్నట్లు గుర్తించామన్నారు. వీరికి నోటీసులు కూడా జారీ చేస్తామన్నారు.

జమ్ము సచివాలయ సందర్శన

నగరంలోని జమ్ము ప్రాంతంలో ఉన్న ఏడో నంబరు సచివాలయాన్ని కమిషనర్ పల్లి నల్లనయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సకాలంలో కార్యదర్శులు విధులకు హాజరవుతున్నారా? లేదా? అన్నది అడిగి తెలుసుకున్నారు. విధుల పట్ల ఉదాసీనంగా ఉన్న వారిని మందలించారు.

అంధుల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పూల్‌బాగ్ ప్రాంతంలోని ప్రభుత్వ అంధుల పాఠశాలను గురువారం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సందర్శించారు. అనంతరం విద్యార్థులకు అవసరైన సదుపాయాల కల్పన, సమస్యల పరిష్కారం కోసం ప్రిన్సిపల్, ఇంజినీరింగ్ సిబ్బందితో చర్చించారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 సత్యవతి పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే అదితి

సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి

బంగారు షాపుల యజమానులతో డిఎస్‌పి



మాట్లాడుతున్న డిఎస్‌పి గోవిందరావు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

బంగారు షాపుల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని విజయనగరం డిఎస్‌పి ఆర్.గోవిందరావు సూచించారు. గురువారం సాయంత్రం విజయనగరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో బంగారం షాపు యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారం షాపు వెనుక, ముందు భాగంలో తగిన భద్రత ఏర్పాటు చేయాలన్నారు. బంగారు షాపుల గదులను పటిష్టంగా నిర్మించాలన్నారు. బంగారం అమ్మే వారి ఆధార్ కార్డులను తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వన్‌టౌన్ సిఐ ఆర్‌విఆర్‌కె చౌదరి, ఎస్ఐ సురేంద్రనాయుడు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి - బొబ్బిలి

క్రమశిక్షణతో చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి అన్నారు. స్థానిక విజేత పాఠశాలలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలిపొందిన విద్యార్థులకు బహు మతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి స్వర్ణకుమారి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


బొబ్బిలి: బహుమతిని అందిస్తున్న విజయగౌరి

గంట్యాడ: విద్యార్థులందరూ బాల్య దశలోనే వివిధ రకాల పుస్తకాలను చదవడం అలవర్చుకోవాలని ఎంఇఒ ఎం.విజయకుమారి అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో గురువారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు నీతి కథల పుస్తకాలను చదవాలని సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయాధికారి బి.రామభద్రరాజు, గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంతకవిటి: స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో గురువారం తహశీల్దార్ బి.సుదర్శన్‌రావు, ఎంపిడిఒ కె.సురేష్‌కుమార్ పాల్గొని వివిధ పోటీ పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: పట్టుదల, కృషితో పాటు ఏకాగ్రతతో విద్యను అభ్యసించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించగలరని ఎంపిడిఒ సురేష్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన ముగింపు ఉత్సవాల్లో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ బూసి నాయుడు, లైబ్రేరియన్ ఎం ఉషారాణి విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్ల: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వైసిపి నాయకుడు కెవి సూర్యనారాయణ రాజు అన్నారు. గుర్ల శాఖ గ్రంథాలయంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి తిరుపతి రావు, ఎంఇఒ భాను ప్రకాశ్, ఎస్ఐ నారాయణరావు, దాసరి ఈశ్వర రావు, సర్పంచ్ ప్రతినిధి ప్రసాద్, గ్రంథాలయాధికారి రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని మొయిద ఎంపిటిసి పెనుమత్స సంతోష్‌బాబు, ఇఒపిఆర్‌డి శంకర జగన్నాథం అన్నారు. గురువారం మొయిద, నెల్లిమర్ల శాఖ గ్రంథాలయాల్లో జరిగిన ముగింపు ఉత్సవాల్లో పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు జి.రమణమ్మ, పి.లక్ష్మి, ఎంఇఒ జ్ఞానశంకర్, పీడీ శ్రీనివాసరావు, ధవల పైడినాయుడు, చందక వెంకట్రావు, అట్టాడ శ్రీను, జనా ప్రసాద్ పాల్గొన్నారు.

పూసపాటిరేగ: కుమిలి శాఖ గ్రంథాలయ అధికారి ఎస్. ఇందుమతి ఆధ్వర్యంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో కె.సూర్యనారాయణ, మురళి, వి.భవాని పాల్గొని గ్రంథాలయాల ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో జెడిపి హైస్కూల్ ఇంఛార్జి హెచ్ఎం మురళీ, గాబు అప్పలరెడ్డి, వి. లక్ష్మణ్, ఎన్. వెంకట నారాయణమూర్తి పాల్గొన్నారు.

వేపాడ: మండల కేంద్రంలో గల శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎస్.నాగభూషణరావు, వసతి గృహం ప్రిన్సిపల్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తవలస: కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి ఆధ్వర్యంలో ముగింపు వేడుకలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రామలక్ష్మి, పంచాయతీ ఇఒ శైలజ, జి.శ్రీదేవి, జె.భారతి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


రేగిడి: విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఇఒ

తెర్లాం: స్థానిక గ్రంథాలయంలో అధికారి సిహెచ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ముగింపు సభలో ఎంఇఒ త్రినాథరావు, ఎస్ఐ సాగర్ బాబు పాల్గొని విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెర్లాం జిల్లా పరిషత్ హై స్కూల్ ఉపాధ్యాయులు ఎస్ఎస్ రమేష్, రిటైర్డ్ ఎంఇఒ సత్యనారాయణ విద్యార్థులు పాల్గొన్నారు.

రేగిడి: స్థానిక శాఖ గ్రంథాలయంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎంఇఒ ఎం.వరప్రసాదరావు పాల్గొని గ్రంథాలయ ప్రాముఖ్యతను వివరించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ పెంట ఈశ్వరరావు, ఉపాధ్యాయులు మురహరిరావు, జి.రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


దెంకాడ: బహుమతులతో విద్యార్థులు, అతిథులు

శృంగవరపుకోట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో సర్పంచ్ గనివాడ సంతోష్ కుమారి పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బొడ్డవర హై స్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయులు పి. కాశీ విశ్వనాథ్, ఓటర్ అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకులు దొడ్డి సూర్యారావు, రయ్యిలి కటకం పావని, రామకృష్ణ, దాసు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

దెంకాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారం రోజులు పాటు నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మహేష్, రిటైర్డ్ గ్రంథాలయాధికారి దేవుడు, విశ్రాంత ఉపాధ్యాయులు అప్పలనాయుడు, ఉపాధ్యాయులు మీనాకుమారి, లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.


గంట్యాడ: మాట్లాడుతున్న ఎంఇఒ విజయకుమారి


కొత్తవలస: విద్యార్థికి బహుమతి అందిస్తున్న సర్పంచ్


నెల్లిమర్ల: విద్యార్థికి బహుమతి అందిస్తున్న ఎంపిటిసి


ఎస్‌కోట: ప్రశంసా పత్రాలతో విద్యార్థులు


సంతకవిటి: బహుమతులు ప్రదానం చేస్తున్న తహశీల్దార్

శత శాతం అక్షరాస్యతతో అభివృద్ధి సాధ్యం

నెల్లిమర్ల: శతశాతం అక్షరాస్యత సాధించడం ద్వారా అభివృద్ధి సాధ్యమవుతోందని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజినీ, కమిషనర్ టి.జయరాం అన్నారు. గురువారం స్థానిక బైరెడ్డి సూర్యనారాయణ కల్యాణ మండపంలో మెప్మా ఆధ్వర్యంలో అక్షరాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నిరక్షరాస్యులు శత శాతం అక్షరాస్యత సాధించడంతో అభివృద్ధి జరుగుతుందన్నారు. నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం మెప్మా అమలు చేస్తున్న కార్యక్రమాలు వార్షిక సంచిక 'అవని' పుస్తకం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఎంఎం నాయుడు, మెప్మా సిఎంఎం గేదెల రాము తదితరులు పాల్గొన్నారు.

జనసేన నెల్లిమర్ల పట్టణ అధ్యక్షులుగా నాని

ప్రజాశక్తి - నెల్లిమర్ల



జనసేన నెల్లిమర్ల పట్టణ అధ్యక్షులుగా రవ్వా నాని, ఉపాధ్యాక్షులుగా జరజాపుపేటకు చెందిన ఎంఎం నాయుడు నియమితులయ్యారు. ఈ సందర్భంగా జనసేన పట్టణ అధ్యక్షులు రవ్వా నాని మాట్లాడుతూ నగరపంచాయతీలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుపుకుని పార్టీ అభివృద్ధికి పాటు పడతానని తనకు పదవి బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే లోకం నాగమాధవి, పార్టీ నాయకులు లోకం ప్రసాద్‌కి కృతజ్ఞతలు తెలిపారు. నానిని, నాయుడుని పలువురు అభినందించారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

కొత్తవలస: డ్రగ్స్ రహిత సమాజం నిర్మింద్దామని సిఐ షణ్ముఖరావు అన్నారు. 'డ్రగ్స్ రహిత సమాజ సంక్షేమానికి' అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ సంయుక్తంగా డ్రగ్స్ గంజాయి మాదక ద్రవ్యాలపై స్కూలు పిల్లలకు, యువతను అవగాహన కల్పించేందుకు చేపట్టిన సైకిల్ ర్యాలీ గురువారం కొత్తవలస చేరుకుంది. ఈ సైకిల్ ర్యాలీకి సిఐ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దెందేరు హైస్కూల్లో పిల్లలతో డ్రగ్స్ అనే మహమ్మారికి దూరంగా ఉండాలని డ్రగ్స్ జోలికి ఎవరూ పోకూడదని మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం అని చెప్పారు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం

బొండపల్లి: హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. గురువారం మండలంలోని గొట్లాం గ్రామంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలనరసయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. మెడికల్ కాలేజీలను ప్రవేట్ పరం చేయడం వల్ల పేద ప్రజలు, విద్యార్థులు వైద్యానికి, విద్యకు దూరమవుతారని చెప్పారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయానికి వ్యతిరేకంగా వైసిపి ప్రజా పోరాటాలు చేస్తుందన్నారు. అనంతరం నాయకులు కోటి సంతకాల ప్రతులను బొత్స అప్పల నరసయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చల్ల చల్లంనాయుడు, వైసిపి మండల అధ్యక్షులు బొద్దల చిన్నం నాయుడు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

దెంకాడ: గ్రామాల్లో తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మన ప్రజలతో మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని మండలంలోని బంటుపల్లి గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సిసి రోడ్లు, పారిశుధ్య పనులు, కాలువలలో పూడిక తీతలు, కాలువల నిర్మాణం, రెవెన్యూ సంబంధిత అంశాలు, మంచినీటి పైపులను లీకులు, ఎస్‌సి కాలనీలో గృహ నిర్మాణ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఎమ్మెల్యే అధికారులకు సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. గొడ్డుపాలెం నుంచి బంటుపల్లి మీదగా భోగాపురం వెళ్లే నీటి కాలువ పూడికతీత తీయాలని, శుభ్రపరచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, సర్పంచ్ చిక్కాల హేమలత, జనసేన నాయకులు చిక్కాల జనార్దన్ రావు, టిడిపి నాయకులు సంఘం సురేష్, పలు శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీను మహంతి

ఫైర్ అండ్ సెక్యూరిటీ సర్వీస్ ప్రారంభం

పూసపాటిరేగ: పెద్ద పెద్ద బిల్డింగులు, పరిశ్రమలలో ప్రమాదాల నివారణకు ఫైర్ అండ్ సెక్యూరిటీ సర్వీస్ ప్రారంభిం చామని ఐఐఎఫ్‌ఐసి గ్రూపు ఫౌండర్ శ్రీను మహంతి అన్నారు. గురువారం ఆయన విజ యనగరంలో ఫైర్ అండ్ సెక్యూరిటీ సర్వీసెస్ గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియాలో ఉన్న ప్రముఖ కంపెనీల ఫైర్ అండ్ సేఫ్టీ అధికారులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీను మహంతి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పరిశ్రమలు, కమర్షియల్ కాంప్లెక్స్, హౌసింగ్ బిల్డింగ్స్‌లో ప్రమాదాలు, సెక్యూరిటీ లోపాలను సరి చేసేందుకు తమ సంస్థ ఫైర్, సెక్యూరిటీని లాంచ్ చేసిందన్నారు. న్యూ జనరేషన్ ఇంటర్నేషనల్ స్టాండర్డ్ తగ్గట్టు తమ సర్వీసెస్ ఉంటాయన్నారు.

రైతుల పక్షపాతి కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - గుర్ల

కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పనిచేస్తోందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు అన్నారు. రాష్ట్ర బిసి సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వెన్ను సన్యాసి నాయుడు అధ్యక్షతన గురువారం తెట్టంగి పిఎసిఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్‌మల్లిక్‌నాయుడు మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవలో భాగంగా నగదు జమస్తున్నామన్నారు. ధాన్యం కొనుగులు జరిగిన 48 గంటల్లోనే రైతుల ఖాతాకు డబ్బులు జమచేస్తామన్నారు. పిఎసిఎస్ చైర్మన్ తిరుములరాజు కిరణ్ కుమార్ మాట్లాడుతూ దళారీలను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం లోనే ధాన్యం అమ్మాలని రైతులకు సూచించారు. గతేడాది 19 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా, ఈ ఏడాది 22 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఎఒ తిరుపతిరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మూ సొసైటీ చైర్మన్, టిడిపి మండల అధ్యక్షులు చనమల్ల మహేశ్వర రావు, గూడెం పిఎసిఎస్ చైర్మన్ పిల్ల అప్పల నాయుడు, ఏఎంసి వైస్ చైర్మన్ దాసరి శివప్రసాద్, డైరెక్టర్ గేదెల సూర్యనారాయణ, తహశీల్దార్ ఆదిలక్ష్మీ, మండల నాయకులు కనిమేరక కృష్ణ, ఎస్.సన్యాసి నాయుడు, సిఇఒ బి.రామునాయుడు, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.


గుర్ల: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

జామి: ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై శిక్షణా కార్యక్రమం మండల పరిషత్ సమావేశ భవనంలో గురువారం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి కుమార్‌స్వామి హాజరు కాగా, జిల్లా పౌర సరఫరా సంస్థ టెక్నికల్ సిబ్బంది, జామి, కొత్తవలస రైతు సేవా కేంద్రాలు సిబ్బంది, జామి, అన్నంరాజుపేట పిఎసిఎస్ సిబ్బందికి శిక్షణ ఇచ్చా రు. ఈ నెల 27న వర్ష సూచన ఉన్నందున రైతులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, వరి కోతలు వాయిదా వేసు కోవాలని, కోసిన పంట కుప్పలుగా వేసుకోవాలని సూచించారు. ఎంపిడిఒ నీలం అప్పలనాయుడు, జామి, కొత్తవలస ఎఒలు ఎమ్ పూర్ణిమ, రాంప్రసాద్, పాల్గొన్నారు.

దత్తిరాజేరు: రైతులు పండించిన ధాన్యాన్ని కొనడానికి రైస్ మిల్లులు సిద్ధంగా ఉన్నాయని తహశీల్దార్ హరికిరణ్ అన్నారు. గురువారం వ్యవసాయ, సివిఎస్‌డిటితో కలిసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటివరకు 75 వేలు గోని సంచులు సిద్ధం చేశామన్నారు. 11 రైతు సేవా కేంద్రాల వద్ద నుండి రైతులు వారికి నచ్చిన మిల్లులకు అమ్ముకోవచ్చు అని చెప్పారు. రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి డబ్బులు జమవుతాయని చెప్పారు.

పిఎఫ్ బకాయిలు తక్షణం చెల్లించాలి: ఎపిటిఎఫ్

బొబ్బిలి: 6 నెలల కాలంగా పెండింగ్‌లో ఉన్న పిఎఫ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జెసి రాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎపిటిఎఫ్ కార్యాలయంలో మండల శాఖ అధ్యక్షులు సిహెచ్‌జె ప్రవీణ్‌కుమార్ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అత్యవస పరిస్థితుల్లో ఉపయోగపడుతుందన్న ఆశతో నెలనెలా కొంతం మొత్తాన్ని పిఎఫ్ ఖాతాలో దాచుకుంటున్నామన్నారు. వైద్య ఖర్చులు, వివాహాలు, పిల్లల ఫీజులు చెల్లిం చాలనే ఉద్దేశ్యంతో పిఎఫ్ లోన్లు కోసం దరఖా స్తులు చేసి 6 నెలలు గడుస్తున్నా నేటికి చెల్లించకపోవటం ప్రభుత్వంపై విశ్వాసం సన్నగిల్లుతుందన్నారు. వెంటనే పిఎఫ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎపిటిఎఫ్ సభ్యులు చిన్నారావు, జి.శర్మ, కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతపై శిక్షణ

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో రెండవ రోజు పచ్చదనం పరిశుభ్రతపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ మాట్లాడుతూ గ్రామాలలో బహిరంగ మలవిసర్జన చేయడం వల్ల అంటూ వ్యాధులు ప్రబులుతాయని, మన చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల అనారోగ్యం బారిన పడకుండా ఆరోగ్యవంతంగా ఉంటామని తెలిపారు. గ్రామాలలో మొక్కలు నాటడం వల్ల పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి.సత్యవంతుడు, వైస్ ఎంపిపి ఈశ్వరరావు, డిప్యూటీ ఎంపిడిఒ రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దెంకాడ: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన గ్రామాల రూపు దద్దుకుంటాయని ఇటువంటి కార్యక్రమాల్లో ప్రజా బాగా స్వామ్యం అవసరమని డిప్యూటీ ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల విఒల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు పంచాయతీ కార్యదర్శులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు సిహెచ్ అప్పలనాయుడు, ఎన్.తులసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్‌సి పరిశీలకులు చంద్రకళ, ఎపిఎం వి.శ్రీనివాసరావు, విఒఎలు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: వ్యర్థాల నిర్వహణతో గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత ఏర్పడుతుందని ఎంపిడిఒ కె.రామకృష్ణరాజు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండవ రోజు పచ్చదనం, పరిశుభ్రత పై విఒఎలు, సంఘ సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేరు వేరుగా సేకరించి తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు విఒఎలు తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు: డ్వాక్రా మహిళా సంఘాలతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపిడిఒ కిషోర్ కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండో రోజు పచ్చదనం, పరిశుభ్రతపై మహిళా సంఘాలకు, విఒలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ శిక్షకులు శివరామకృష్ణ, మహేష్, ఎపిఎం రమణ పాల్గొన్నారు.

మామిడిపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని పారసాం పంచాయతీలో రైతులకు మామిడి పంటపై గురువారం ఉద్యానశాఖ అధికారి జ్యోత్స్నరాణి శిక్షణ ఇచ్చారు. రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎస్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ మామిడి పంటలో ఎరువుల యాజమాన్యం పూత పిందె రాలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు కోతకు ముందు కోత అనంతరం యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం మామిడి రైతులతో ముఖాముఖి చర్చ జరిపి రైతుల సందేహాలు తెలుసుకొని వాటికి తగు పరిష్కారం చూపించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సంగం రెడ్డి జగన్నాథం, ఉద్యాన విస్తరణ అధికారి ఎస్. సుజాత, గ్రామ వ్యవసాయ, హార్టికల్చర్ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

వేపాడ: వేపాడ గ్రామంలో రైతులు వేసిన పండ్ల మొక్కల పెంపకాన్ని, ఎన్‌డబ్ల్యూపిసి సెట్‌ని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, ఎపిఒ ఆదిలక్ష్మి, ఉపాధి హామీ సిబ్బంది పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద ఎం రమణ, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - చీపురుపల్లి

ఆటోలను నడిపేటప్పుడు మీ కోసం ఒక కుటుంబం ఎదురు చూస్తుందని మర్చిపోవద్దని ఆటో డ్రైవర్లను ఉద్దేశించి డిఎస్‌పి ఎస్.రాఘవులు అన్నారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో రోడ్డు భద్రత అనే అంశంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జీవనోపాధి కోసం నిత్యం రోడ్లమీద ఆటోలను నడుపుతూ జీవిస్తున్న ప్రతి ఒక్క ఆటో డ్రైవరు విధిగా నిబంధనలను పాటించి ప్రమాదాలకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడు పుతూ ప్రమాదాలకు గురి కావడం వల్ల ప్రాణాలు కోల్పోతే ఆయా కుటుంబాలు రోడ్డున పడతాయని ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిత్యం ప్రయాణాలు సాగించే ఆటో డ్రైవర్లు అనుమానస్పద వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్ఐ ఎల్.దామోదర్‌రావు పాల్గొన్నారు.

ఐక్యంగా పనిచేయాలి:ఎమ్మెల్యే

ప్రజాశక్తి- జామి

మండలంలో టిడిపి నాయకులు అందరూ ఐక్యంగా పని చేయాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. గురువారం జామి కల్యాణ మండపంలో టిడిపి అధ్యక్ష పదవి ప్రమాణ స్వీకారంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. కూటమి ప్రభుత్వ పాలనకు అనుగుణంగా అందరినీ కలుపుకొని పని చేయాలని సూచిం చారు. కార్యక్రమంలో ఐదు మండలాల టిడిపి అధ్యక్షులు, మండల నాయకులు రెడ్డి పైడిబాబు, జామి మాజీ సర్పంచ్ వెంకట త్రివేణి, గజపతి నగరం నియోజకవర్గం టిడిపి అధ్యక్షుడు పి. స్వామినాయుడు, శ్రీలక్ష్మి, టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

విలేకరిపై దాడి

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని శాతంవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో వీధి కుక్కల నడుమ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న వైనాన్ని గురువారం సెల్‌లో ఫోటోలు తీసిన విశాలాంధ్ర విలేకరిపై ఉపాధ్యాయ సిబ్బంది భౌతికంగా దాడి చేశారు. సెల్ లాక్కొని నేలకు కొట్టి, నీ దిక్కున్న చోట చెప్పుకో అని బెదిరించారు.

ఈ సంఘటనపై సంబంధిత ఉపాధ్యాయులు తక్షణమే విలేకరికి క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో జిల్లా, రాష్ట్ర విలేకరుల సంఘం దృష్టికి తీసుకువెళ్లి ఆందోళన చేస్తామని మండల విలేకర్ల సంఘం హెచ్చరించింది. ఈ విషయంపై ఎంఇఒ ఎం.చంద్రశేఖర్‌ను విలేకరులు వివరణ కోరగా విచారణ చేపట్టి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

ఆర్మీ జవాన్‌కు అంత్యక్రియలు

మెరకముడిదాం: మండలంలో గొల్లలవలస గ్రామానికి చెందిన అడ్డూరు దుర్గారావు అస్సాంలో ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహిస్తూ ప్రమాద వశాత్తు మరణించిన విషయం తెలిసిందే. ఈయన గతేడాది అగ్ని వీర్‌గా ఎంపికై విధులు నిర్వహిస్తుండగా మృతి చెందాడు. మృత దేహాన్ని స్వగ్రామం గొల్లలవలస తరలించి గురువారం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియల్లో ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు, ఇంఛార్జి ఆర్‌డిఒ ప్రమీలా గాంధీ, తహశీల్దార్ ఆకుల సులోచన రాణి, బుధరాయవలస ఎస్ఐ జె. లోకేష్‌కుమార్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు, నాయకులు తాడ్డి సన్యాసినాయుడు, కోట్ల మోతిలాల్ నాయుడు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రిట్ పిటిషన్‌ను తోసిపుచ్చిన హైకోర్టు

శృంగవరపుకోట: మండలంలోని జిందాల్ కంపెనీ కోసం రైతులు ఇచ్చిన భూములపై వేసిన రిట్ పిటిషన్‌ను రాష్ట్ర హైకోర్టు గురువారం తోసిపుచ్చింది. పరిశ్రమ నిర్మాణం కోసం సేకరించిన భూములను వెనక్కి ఇప్పించాలంటూ గుడిమెట్ల సత్యవతి, చలుమూరు చిన్నప్పలనాయుడు హై కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ రిట్ పిటిషన్ అత్యవసర టాపిక్ కాదని, వారికి ఇది వరకే అన్ని విధాలుగా నష్టపరిహారం చెల్లించామని పరిశ్రమ యాజమాన్యం తెలపడంతో రిట్ పిటిషన్ హై కోర్టు తోసిపుచ్చింది.

కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించాలి

ప్రజాశక్తి- కొత్తవలస

0కుష్టు వ్యాధి గ్రస్తులను ప్రారంభ దశలోనే గుర్తించాలని డిపిఎంఒ ఎల్.అప్పల స్వామి అన్నారు. వియ్యంపేట పిహెచ్‌సి పరిధిలోని ముసిరాం, తుమ్మికాపల్లి, సీతంపేట గ్రామాలలో ఎల్‌సిడిసి సర్వేలో భాగంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణతో కలిసి ఇంటింటి సర్వేని పరిశీలించి అనుమానిత కేసులను పరీక్షించి నిర్ధారించారు. ఆశ కార్యకర్తలు, వాలంటీర్స్, ఇంటింటి సర్వే పక్కగా నిర్వహించి అనుమానిత కేసులను గుర్తించాలన్నారు. కుష్టు వ్యాధి వ్యాప్తి, వ్యాధి లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రజలకు ఆడియో, వీడియో, కరపత్రాలు ద్వారా ఐఇసి ద్వారా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్ర మంలో లేప్రోసి నోడల్ పర్సన్ ఎం.ఈశ్వరావు, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఎంఎల్‌హెచ్ పి.కామేశ్వరి, ధనలక్ష్మి, ఏఎన్ఎం గౌరీ, సుగుణ, ఆశ వర్కర్స్ విజయలక్ష్మి, జగదీశ్వరి పాల్గొన్నారు.